క్లుప్తంగా

పత్తి పంటను కాపాడుకోండి

తలకొండపల్లి: వారం రోజులుగా మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు తగు జాగత్తలు తీసుకొని పత్తి పంటను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముసురు తగ్గిన తర్వాత వ్యవసాయాధికారుల సూచనలు, సలహాల మేరకు తగు జాగత్తలు పాటించినచో పంట ఎదగడానికి అవకాశముంటుందని ఏఓ రైతులకు సూచించారు. 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ రసాయానిక ఎరువులను పైపాటుగా 20 రోజులు, 40 రోజులు వయస్సున్న పంటకు మొక్కల మొదళ్లలో7.10సెం.మీ దూరంలో పాదులు తీసి రసాయానిక ఎరువులను వేసి మట్టితో కప్పినట్లైతే పంట త్వరితగతిన ఎదిగే అవకాశముంటుందని తెలిపారు. 19:19:19: లేదా 13-0-45 లేదా 10 గ్రాముల యూరియా లీటర్ నీటికి కలిపి వారంలో రెండు సార్లు పిచికారి చేసినట్లైతే ముంపునకు గురైన పంట త్వరగా కోలుకుంటుదని పేర్కొన్నారు. 3 గ్రాముల కాపర్-ఆక్సీ-క్లోరైడ్ లేదా 2 గ్రాముల కార్బెండజిమ్ ప్లస్ మ్యాంటజేట్ శిలీందనాశక మందును లీటర్ నీటికి కలిపి నేల బాగా తడిచేటట్టు వారంలో రెండు సార్లు పిచికారి చేసినట్లైతే తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించేకోవచ్చని తెలిపారు.

మొక్కలతోనే మానవ మనుగడ

మున్సిపల్ ఛైర్ పర్సన్ స్రవంతి



మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్రవంతి

ఇబ్రహీంపట్నం: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని మున్సిపల్ ఛైర్ పర్సన్ కప్పరి స్రవంతి పేర్కొన్నారు. గురువారం ఇబ్రహీంపటన్నం చెరువు కట్టపై హెచ్ఎండీఏ సహకారంతో పట్టణ సుందరీకరణలో భాగంగా డివైడర్లపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని స్రవంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్ద చెరువును సుందరీకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బర్ల మంగ జగదీశ్వర్‌యాదవ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

మంచాల: గ్రామాల్లో ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని మండల ప్రత్యేకాధికారి సుభాషిణి అన్నారు. గురువారం మంచాలలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలందరి భాగస్వామ్యంతో వనమహోత్సవం విజయవంతం చేయలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాల శంకర్, ఎంపీఓ ఉమరాణి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించండి

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: వర్షాలు కురుస్తున్న దృష్ట్యా అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో పర్యటించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామ సభ నిర్వహించి పరిసరాల పరిశుభ్రత, జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం నక్కర్తమేడిపల్లి గ్రామంలో పర్యటించి ఉన్నత పాఠశాల సమీపంలో డ్రైనేజీ సమస్యను పరిశీలించి శాశ్వత సమస్య పరిష్కారాం కోసం కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

31న ఆమనగల్లు లయన్స్ క్లబ్ ప్రమాణ స్వీకారం

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఈ నెల 31న కల్వకుర్తిలోని తోడేటి చెన్నారెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించనున్నారు. 2024-25 సంవత్సరానికి ఆమనగల్లు లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా పసుల లక్ష్మారెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నూతన అధ్యక్షుడిగా పసుల లక్ష్మారెడ్డి, కార్యదర్శి దోనాదుల మహేశ్, కోశాధికారిగా నర్సింహ, ఉపాధ్యక్షుడిగా గోవర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎంగలి బాలకృష్ణ, పీఆర్ఓగా పాషా, టేమర్‌గా బండెల రామచంద్రారెడ్డి, టేల్ ట్విస్టర్‌గా మోహన్‌రెడ్డి, సలహాదారులుగా సంపత్‌కుమార్, చంద్రశేఖర్, కరుణాకర్‌రెడ్డి, అంజయ్య, సునంద, భిక్షపతి, సత్యం, చంద్రకాంత్‌రెడ్డి, రవికుమార్, సురేందర్‌రెడ్డిలు ప్రమాణస్వీకారం చేస్తారు. డిస్ట్రిక్ వైస్ గవర్నర్, మహేందర్‌కుమార్‌రెడ్డి, మాజీ డిస్ట్రిక్ గవర్నర్ రాజగోపాల్‌రెడ్డి హాజరు కావాలని పీఆర్ఓ పాషా కోరారు.

గుంతలమయంగా కాగజ్ ఘాట్

- చిన్నపాటి వర్షానికి రహదారిపై చేరుతున్న నీరు
- ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోని రోడ్డు
- రాకపోకలకు అంతరాయం
- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కాగజ్ ఘాట్‌రోడ్డు గుంతల్లో చేరిన నీరు

మంచాల: మండలపరిధిలో రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. చిన్నపాటి వర్షానికి ఈ రోడ్డుపై వర్షం నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. నాలుగు చినుకులు పడితే చాలు రోడ్డంత వర్షపు నీటితో నిండి గుంతల్లో చేరుతుంది. ఆగాపల్లి గ్రామం నుంచి మంచాల, ఆరుట్ల, లోయపల్లి గ్రామాలకు వెళ్లాంటే కచ్చితంగా కాగజ్ ఘాట్ గ్రామం మీదుగానే ప్రయాణం చేయాలి. గ్రామంలోకి రాగానే ప్రారంభంలోనే పాడైన రోడ్డు దర్శనమిస్తుంది. నాలుగు చినుకులకే రోడ్డుపై ఏర్పడిన గోతుల్లో నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ఏండ్లు గడుస్తున్నా ఈ రోడ్డు గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ విషయం గురించి అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. అధికారులను సందర్శించినప్పుడు బాగు చేస్తామని చెప్పడం తప్ప చేసేదేమి లేదు. ఈ గుంతల రోడ్డుపై వర్షపు నీరు చేరడంతో వాహనాల రాక పోకలకు ఇబ్బందిగా మారడమే కాకుండా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని దుస్థితి నెలకొంది. అనేక మంది రోడ్డు బాగ లేక కింద పడిన సంఘటనలు కూడా లేకపోలేదు. ఈ రోడ్డుగుండా వెళితే తరచూ ప్రమాదాలకు గురవుతున్నట్లు వాహనదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు



ఈ రోడ్డు వేసేటప్పుడే సక్రమంగా వేయలేదు. దీంతో రోడ్డు గుంతల మయంగా మారింది. సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయంలో వెంటనే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి.

– దూసరి యాదయ్య గౌడ్, కాగజ్ ఘాట్

తక్షణమే బాగు చేయాలి



నిత్యం వందలాది వాహనా దారులు ఈ రోడ్డు గుండా ప్రయాణం చేస్తారు. తక్షణమే ప్రభుత్వం బాగు చేయాలి. రోడ్డుపై గోతులు ఏర్పడి వర్షం పడినప్పుడు నిండి ప్రయాణికులకు ప్రమాదకరంగా మారుతుంది. ప్రమాదాలు జరగక ముందే తగిన చర్యలు తీసుకోవాలి.

– సయ్యద్ రిజ్వాన్, కాగజ్ ఘాట్

అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టిందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యా నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంభించిన విధానాలతో రాష్ట్రంలో ఆర్థిక పరమైన అనేక ఇబ్బందులున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం అభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల నిర్మాణంతో పాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమాభివృద్ధికి, విద్యా, వైద్యరంగాల అభివృద్ధికి పెద్దమొత్తంలో నిధులు కెటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, సేవాదళ్ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

బీఎస్ఆర్ ట్రస్ట్ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

యాచారం: సమాజంలో ఉత్తమ పౌరులను తయారు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నందివనపర్తి ఉన్నత పాఠశాల నుంచి ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఇతర పాఠశాలల నుంచి బదిలీపై నందివనపర్తి ఉన్నత పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులకు గురువారం ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమకు వచ్చిన అవకాశాన్ని దేవుడిచ్చిన వరంగా భావించి విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్ధంతి సభను విజయవంతం చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జాన్‌వెస్లీ



ఇబ్రహీంపట్నం: మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో శనివారం నిర్వహించనున్న మాజీ ఎమ్మెల్యే మస్కు నరసింహ వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జాన్‌వెస్లీ, పార్టీ జిల్లా కార్యదర్శి కాడిగాళ్ల భాస్కర్ పిలుపునిచ్చారు. గురువారం ఇబ్రహీంపట్నం పాషనరహరి స్మారక కేంద్రంలో మండల సీపీఎం కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, కూలీల తరుపున భూపోరాటలు చేసి పేద ప్రజల పక్షపాతిగా నరసింహ నిలిచారని కొనియాడారు. 2004 నుంచి 2009 వరకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా కొనసాగిన నర్సింహమ్మ అసైన్‌మెంట్ పట్టాలు, ఇండ్లు, ఇళ్ల స్థలాలను పేదలకు పంచిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామేల్, మండల కార్యదర్శి జంగయ్య, బుగ్గరాములు, జగన్, గణేష్, నర్సింహ్మ, వెంకటేష్, రామకృష్ణారెడ్డి, జంగయ్య, ఆనంద్, విఘ్నేష్‌లు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం రూరల్‌లో..

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ నాలుగో వర్ధంతి సభను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యులు కందుకూరి జగన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన ఇబ్రహీంపట్నంలోని సీపీఎం కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ వర్ధంతి వేడుకలు నిర్వహిస్తారన్నారు. అనంతరం ×మతం-మతోన్మాదం₹ అనే అంశంపై అవగాహన తరగతి ఉంటుందన్నారు. ముఖ్య అతిథులుగా సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. సీపీఎం సానుభూతి పరులు, కార్యకర్తలు, వేలాదిగా తరలిరావాలని కోరారు.

ఎరువుల నిల్వలను నమోదు చేయాలి

ఆమనగల్లు: ఎరువుల డీలర్లు తమ షాపుల్లో ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు ఈ పాస్‌లో నమోదు చేయాలని ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. ఎరువుల కొరత సృష్టిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలోని పలు ఎరువుల షాపులను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా షాపులలో స్టాకు రిజిస్టర్లను, ఎరువుల నిల్వలను పరిశీలించారు. అనంతరం వ్యవసాయాధికారి అరుణకుమారి మాట్లాడుతూ ఆమనగల్లు మండలంలో రైతులకు సరిపడే ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులు విక్రయించే ఎరువుల వివరాలను ఈ పాస్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డీలర్లు జంగయ్య, సామల రవి, సురేశ్, చంద్రమౌళి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి అరుణకుమారి

తలకొండపల్లి: రైతులకు సరిపడ ఎరువులను అందుబాటులో ఉంచుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజు సంబంధిత అధికారులు, దుకాణపు యజమాన్యానికి సూచించారు. గురువారం మండల పరిధిలోని వెల్జాల్‌లో ప్రాథమిక సహకార కేంద్రం ఎరువుల గోదాం, ఆగ్రో రైతు సేవాకేంద్రం, న్యూ స్వామి ట్రేడర్స్ ఎరువుల దుకాణాలను ఏఓ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. యూరియా డీఏపీ, కాంప్లెక్స్, తదితర ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని ఏఓ చెప్పారు. ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలన్నారు. అనంతరం ఎస్‌బీఐ బ్యాంక్‌ను సందర్శించి బ్యాంక్ మేనేజర్‌తో ఏఓ మాట్లాడారు. రైతు రుణమాఫీ నిధులను రైతుల ఖాతాలోనే జమ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ నాగరాజు, ఫీల్డ్ ఆఫీసర్ వెంకట్రావ్, సింగిల్‌విండో ఉప సీఈఓ విజేందర్‌రెడ్డి, రైతు మోహన్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

జేఈ వ్యాక్సినేషన్ తప్పనిసరి

యాచారం: మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు గురువారం జేఈ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి రాజ్యలక్ష్మి మాట్లాడారు. ఆరేళ్ల నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థులకు వ్యాక్సిన్ వేయించాలన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల భిక్షాటన

ఆమనగల్లు: పట్టణంలో గురువారం గ్రామ పంచాయతీ కార్మికులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న గ్రామ పంచాయతీ కార్మికులు చలో అసెంబ్లీ చేపట్టనున్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, 14వ పీఆర్‌సీలో నిర్ణయించిన విధంగా గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు అందించాలని కార్మికులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాండు, ఏరియా కన్వీనర్ పెంటయ్య, యూనియన్ అధ్యక్షుడు పాండు, సభ్యులు లక్ష్మణ్, గోపాల్, దోళి, పిప్లి, చక్రి, శాంతి, నీల తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ



సత్యంను సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్: మండలంలో ఎంపీఓ తేజ్‌సింగ్‌తో పాటు, 14 మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. ఎంపీఓ తేజ్‌సింగ్ నందిగామకు, కడ్తాల్ పంచాయతీ రాఘవేందర్ చేవేళ్లకు, శ్రీహరిగౌడ్ కర్కల్‌పహాడ్ నుంచి దెబ్బడగూడ (కందుకూర్)కు, సత్యం మైసిగండి నుంచి తలకొండపల్లికి, జగదీశ్వర్ ముద్విన్ నుంచి కమ్మదనం (ఫరుఖ్‌నగర్)కు, జగన్ న్యామతాపూర్ నుంచి కొత్తపేట (కేశంపేట్)కు, లింగారెడ్డి కొండ్రిగా నిబోడ్ తండా నుంచి జంగారెడ్డిపల్లి (తలకొండపల్లి)కి, వి రాఘవేందర్ గడ్డమీది తండా నుంచి ఖానాపూర్ (తలకొండపల్లి)కి, జీ.రాఘవేందర్ వాస్‌దేవ్‌పూర్ నుంచి తుమ్మలకుంట తండా (తలకొండపల్లి)కు, రాజునాయక్ మక్తమాదారం నుంచి చెన్నారానికి(తలకొండపల్లి), ప్రసాద్ గానుగుమార్ల తండా నుంచి సీతారాంనగర్ తండా (ఆమనగల్లు)కు, ప్రశాంత్ గోవిందాయిపల్లి తండా నుంచి మంథన్‌గౌరెల్లి (యాచారం)కి, గణేశ్ గోవిందాయిపల్లి నుంచి పాతకోట తండా (తలకొండపల్లి), హరీశ్‌రెడ్డి అన్మాస్‌పల్లి నుంచి లోయపల్లి (మంచాల)కి, రమేశ్ పెద్దవేములోనిబావితండా నుంచి దాసర్లపల్లి పెద్దమ్మ తండా (కందుకూర్)కు బదిలీ అయ్యారు.

అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు

విధి నిర్వహణలో బదిలీలు సహజమని అంకిత భావంతో పనిచేసే వారికి సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయని మాజీ ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, బీజేపీ నాయకులు రాందాస్ నాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మైసిగండి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పది సంవత్సరాలుగా విధులు నిర్వహించి, తలకొండపల్లి మండలానికి బదిలీపై వెళ్తున్న సత్యంను గురువారం మైసిగండి గ్రామంలో ఘనంగా సన్మానించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్యదర్శి సత్యంను, గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో రెడ్యానాయక్, చందన్‌నాయక్, పంత్యానాయక్, శ్రీను, చందులాల్, కల్యాణ్, మహేశ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

మున్సిపాలిటీ ఛైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లోని 5, 8, 6 వార్డుల్లో మున్సిపాలిటీ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ వారం రోజుల నుంచి వర్షాలు విస్తారంగా కురుస్తున్నయన్నారు. వర్షాన్ని లెక్క చేయకుండా పారిశుద్ధ్య సిబ్బంది ఇండ్ల మధ్య ఉన్న చెత్త చెదారం, మురికి తొలగిస్తున్నారని తెలిపారు. ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కొంగరకలాన్‌లో ప్రధాన కూడలిలో రోడ్లపై వర్షు నీటి వలన ప్రజలకు రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్నందునా వాటిని తొలగించాలని, వాటికి కావాల్సిన మ్యాన్ హోల్స్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కొంగరకలాన్‌లో శిథిలావస్థలో ఉన్న 17 ఇండ్లను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేసి వాటిని కూల్చివేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అక్కడ నిలిచిన వర్షపు నీరు తొలగించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. తాగునీరు, మూత్రశాలల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కొంగరకలాన్ తండాలో పర్యటించామన్నారు. అవసరమైన చోట భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వనం శ్రీనివాస్, గోపగళ్ల మహేందర్, కోలా నాగేష్, నీళ్ల హరిదాస్‌గౌడ్, కమిషనర్ బాలకృష్ణ, ఏఈ వీరాంజనేయులు, టీపీఓ అబీబ్‌ఉన్నీసాబేగం, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన 2024-25 సంవత్సర వార్షిక బడ్జెట్ ప్రజా ఆమోదయోగ్యమైనదని కొందరు నిరాశాజనకంగా ఉందని మరికొందరు ప్రభుత్వ బడ్జెట్‌పై భిన్న అభిప్రాయాలను వ్యక్త పరిచారు.


వ్యవసాయ రంగానికి పెద్దపీట



ఇబ్రహీంపట్నం: ఆర్భాటపు అంకెలు కాదు...వాస్తవ లెక్కల బడ్జెట్ ఇది. ఆరు గ్యారంటీలకు హామీ పత్రంగా ఈ బడ్జెట్ ఉంది. కేంద్రం వివక్ష, గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాల మధ్య తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా రాష్ట్రాభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ రూపొందించిన బడ్జెట్. అన్నివర్గాల ప్రజలకు సముచిత న్యాయాన్ని కల్పిస్తూ బడ్జెట్‌ను రూపొదించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అభినందనలు.

– చిలుక మధుసూదన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి

దివ్యాంగుల నిధుల్లో కోత



దివ్యాంగుల సంక్షేమం, ఆసరా పెన్షన్‌దారులకు బడ్జెట్‌లో నిధులను కేటాయించలేదు. బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడ వికలాంగుల గురించి ప్రస్తావించలేదు. రాష్ట్రంలో 12.02 శాతం ఉన్న వికలాంగుల సంక్షేమంపట్ల రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం అవుతుంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 29,816 కోట్ల కేటాయింపులతో ఆసరా పెన్షన్స్ 4వేల పెంపు, వికలాంగుల పెన్షన్ ఆరు వేల పెంపు ఎలా సాధ్యమౌతుంది.

– జెర్కొని రాజు, జాతీయ వేదిక ప్రధాన కార్యదర్శి

ఇది రైతు ప్రభుత్వం: పీఏసీఎస్ ఛైర్మన్ హన్మంత్‌రెడ్డి


మంచాల: రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేసి రైతు ప్రభుత్వంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనదైన ముద్ర వేసుకుంటున్నారని మంచాల పీఏసీఎస్ చైర్మన్ వెదెరె హన్మంత్‌రెడ్డి అన్నారు. గురువారం మంచాలలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రతిపక్షాలు రాజకీయ పబ్బం కోసం అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రతి రైతుకు రుణ మాఫీ చేస్తుందన్నారు.

బీసీలను విస్మరించారు



తలకొండపల్లి: బీసీలను విస్మరించే విధంగా రాష్ట్ర బడ్జెట్ ఉంది. జనాభలో 55 శాతానికి పైగా ఉన్న బీసీ సంక్షేమానికి కేవలం రూ. 9,200 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. బీసీలను మోసం చేసే బడ్జెట్‌గా అభివర్ణించవచ్చన్నారు. బడ్జెట్‌లో మత్స్యకారుల ప్రస్తావన లేదన్నారు. కొత్త పంచాయతీలైన తండాలకు ప్రత్యేక నిధులు కేటాయించలేదు. రైతుబంధు గురించి స్పష్టమైన హామీ కాని నిధుల ప్రస్తావన లేదన్నారు. వివిధ కులాలకు సంబంధించిన కార్పొరేషన్‌లకు ప్రత్యేక నిధులు కేటాయించలేదు. – బక్కి కుమార్, మాజీ సర్పంచ్, చంద్రధన


ప్రజా సంక్షేమాన్ని విస్మరించింది



కడ్తాల్: ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, కేవలం అంకెల గారడీ తప్ప ఏమీ లేదు. ఎన్నికల హామీలకు, ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు ఏమాత్రం పొంతన లేదు. గ్రామ పంచాయతీల వారిగా పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపుల విషయమై నిర్దిష్టమైన ప్రకటన చేయకపోవడం కేవలం కక్ష సాధింపు ధోరణిగా ఉంది.

– గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కడ్తాల్

కార్మిక రంగాన్ని విస్మరించారు



తుర్కయంజాల్: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కార్మిక రంగాన్ని పూర్తిగా విస్మరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు తీసుకువచ్చిన కనీస వేతనాల చట్టం గురించి ప్రస్తావనే లేదు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచకపోవడం వల్ల కార్మిక వర్గం నష్టపోతుంది.

– ఓరుగంటి యాదయ్య, ఏఐటీయూసీ, జిల్లా ప్రధాన కార్యదర్శి

నిరాశే మిగిలింది



తుర్కయంజాల్: విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పూర్తిగా నిరాశ పరిచింది. నాలుగు ఏళ్లుగా పూర్తి స్థాయిలో ఫీజు రీయిబర్స్ మెంట్ కాకపోవడంతో విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నాయి.

– అనంతుల రామూర్తి గౌడ్, బీసీ విద్యార్థి యువజన సంఘం, రాష్ట్ర అధ్యక్షుడు


విద్యా రంగానికి కేటాయింపులు తక్కువే



మంచాల: విద్యాభివృద్ధితోనే బంగారు తెలంగాణ సాధ్యమని నినదిస్తున్న ప్రభుత్వం విద్యా రంగానికి కేటాయిస్తున్న బడ్జెట్ గతంతో పోలిస్తే తగ్గుముఖం పడుతుంది. రూ.2,91,191 కోట్లతో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం రూ.21,292 కోట్లు మాత్రమే కేటాయించింది. దీంతో విద్య రంగా అభివృద్ధిపై ప్రభు త్వానికి ఉన్న చిత్త శుద్ధి తేటతెల్లమైంది.

– ఏ.వీ సుధాకర్, ఎస్టీయూటీయస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట



కడ్తాల్: వ్యవసాయం, విద్య, వైద్య రంగాలతో పాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు, పట్టణ, గ్రామీణాభివృద్ధికి సంతృప్తి పరిచేవిధంగా ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ, ప్రజా ఆమోదయోగ్యంగా ప్రవేశ పెట్టడం హర్షణీయమని అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఎన్నికల హామీలతో పాటు, మరిన్ని కొత్త పథకాలను అమలు చేసే విధంగా బడ్జెట్ అద్భుతంగా ఉంది.

– అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, పీసీసీ సభ్యుడు, కడ్తాల్

రైతులను ఆదుకునేలా ఉంది



ఇబ్రహీంపట్నం రూరల్: వ్య వసాయ రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. గత ప్రభుత్వాల కంటే ఈ బడ్జెట్ రైతులను ఆదుకునేలా ఉంది. సాగుకు పద్దు రూ.72,659 కోట్లు కేటాయించడం చాలా సంతోషంగా ఉంది. రైతుల రుణమాఫీకి మరో రూ.31,000 కోట్లు వెచ్చించి అందరికీ రుణమాఫీ చేయడం చరిత్రలో ఎవరు చేయని ఘనతే. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి తరహాలో బడ్జెట్ కేటాయించి రైతు పక్షపాతిగా నిలవనుంది.

– ఎండీ జహంగీర్‌ఖాన్